క్లుప్తంగా

వాహనదారులు నిబంధనలు పాటించాలి



మానవపాడు: ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలని ఎస్‌ఐ చంద్రకాంత్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనం నడుపరాదన్నారు. హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసకుంటామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వృథాగా తాగునీరు



అయిజ: మండలంలోని కుర్వపల్లి గ్రామంలో గురువారం ఓవర్ హెడ్ ట్యాంక్ వద్ద తాగునీరు వృథాగా రోడ్డుపై పారుతుంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వృథాగా పారుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోలేదని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నా తాగునీటిని సరఫరా చేయడం లేదని వాపోతున్నారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే



కేటీదొడ్డి: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే ముమ్మరంగా కొనసాగతోంది. గురువారం మండలంలో నిర్వహిస్తున్న సర్వేను ఎంపీడీఓ కృష్ణమోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ యాప్‌లో ఇందిరమ్మ ఇళ్ల కోసం నిర్వహిస్తున్న సర్వేలో వారి వివరాలు అప్‌లోడ్ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



అలంపూర్ : ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందించడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన ఎల్‌ఓసీని గురువారం అందజేశారు. అయిజ మండలం పులికల్ గ్రామానికి చెందిన తెలుగు సుజాత వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ. 5 లక్షల ఎల్‌ఓసీని కుటుంబ సభ్యులకు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రఘురెడ్డి, లోకేష్ పాల్గొన్నారు.

శాంతి దూత క్రీస్తు



మల్దకల్ : సర్వమత శాంతి స్థాపన కోసం పుట్టిన మహనీయుడు శాంతిదూత ఏసుక్రీస్తు అని సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, పాస్టర్ డానియల్ అన్నారు. క్రిసమస్ పండగ పురస్కరించుకుని గురువారం రాత్రి మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం చిన్నారులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అదే విధంగా క్రిస్మస్ సందర్భంగా నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్లు డానియల్, పరంజ్యోతి, క్రైస్తవులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

గద్వాల: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన గురువారం పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణ ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ తెలిపిన వివరాలు.. గద్వాల పట్టణానికి చెందిన రమేష్ 7 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా మేలచేర్వు రోడ్డు వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. రమేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సంతలో వసతులు కరువు

- నంతల్లో కానరాని మౌలిక వసతులు
- ఆదాయం వస్తున్నా... ఏర్పాట్లపై దృష్టి కరువు
- సౌకర్యాలు కల్పించాలని వ్యాపారస్తుల డిమాండ్



మానవపాడులో నేలపైనే నిర్వహిస్తున్న వారాంతపు సంత

మానవపాడు: నిత్యావసర వస్తువులు మొదలు చిన్న చిన్న వస్తువుల కొనుగోలుకు గ్రామాల్లో నిర్వహించే వారాంతపు సంతల్లో మౌలిక వసతుల కరువుతో వ్యాపారస్తులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంతల్లో ఉపాధి హామీ నిధులతో వసతులు సమకుర్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వం సూచనలు చేసింది. ఉత్తర్వులు జారీ అయి ఏళ్లు గడుస్తున్నా అధికారుల నిర్లక్ష్యం, గ్రామ పంచాయతీల పట్టింపులేని తనంతో ఎక్కడా అమలు కావడం లేదు. వ్యాపారులు, వినియోగదారులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో గ్రామ పంచాయతీలు, అధికారులు విఫలమౌతున్నారు. ముఖ్యంగా వ్యాపారులకు, షెడ్లు, గద్దెలు నిర్మించకపోవడంతో నేలపైనే వ్యాపారం చేస్తున్నారు.

మౌలిక వసతులు కరువు..

వారాంతపు సంతల్లో కనీసం సౌకర్యాలు కూడా కరవయ్యాయి. తాగునీరు, మరుగుదొడ్లు, ప్లాట్‌ఫాం, మూత్రశాలలు, మురుగుకాల్వలు, ఇంకుడు గుంతలు, నిర్మాణం, చెత్త వేసేందు కుస్థలం, పార్కింగ్ సౌకర్యాలు ఇలా అన్ని సమస్యలే.

షెడ్లు కూడా లేవు..

వారసంతల్లో పూర్తి స్థాయిలో షెడ్డులు నిర్మించకపోవడంతో వ్యాపారస్తులు, ప్రజలు ఎండ, వానలకు తడుస్తూనే క్రయవిక్రయాలు జరుపుతున్నారు. ప్రతి వ్యాపారి నుంచి రుసుము వసూలు చేస్తున్నా సౌకర్యాలు మాత్రం కల్పించడం లేదంటూ వ్యాపారస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చెన్నిపాడు, గోకులపాడు, పెద్దపోతులపాడు, చిన్నపోతులపాడు, అమరవాయి, పెద్ద ఆముదాలపాడు, నారాయణపురం, కలుకుంట్ల, కొర్విపాడు, చంద్రశేఖర్‌నగర్ నుంచి ప్రజలు వార సంతకు వందల సంఖ్యలో వస్తుంటారు.

వర్షకాలంలో తీవ్ర ఇబ్బందులు..

వర్షకాలంలో వ్యాపారులు, వినియోగదారులు తీవ్ర సమస్యలు ఎదురువుతున్నాయి. ఎటు చూసిన దారులన్ని బురదమయం కావడంతో అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. కొన్ని సంతల్లో మార్కెట్ ఏరియా సరిపోవడం లేదు. దీంతో వ్యాపారులు రోడ్లపైనే విక్రయాలు చేస్తున్నారు. ఫలితంగా ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి ఏడాది వారసంతలకు ఆదాయం వస్తున్నా సౌకర్యాలు మాత్రం శ్రద్ధ చూపడం లేదు.

మరుగుదొడ్లు నిర్మించాలి..



గత 20 సంవత్సరాలుగా కురగాయల వ్యాపారం చేస్తున్నాం. ప్రతి బుధవారం మానవపాడులో వారసంత ఉంటుంది. సంతలో మౌలిక వసతులు లేవు. ముఖ్యంగా మహిళలకు మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి. సంత పక్కనే ఉన్న మురుగు కాలువ దుర్గంధంతో ఇబ్బంది పడుతున్నాం.

- మద్దమ్మ, శాంతినగర్

షెడ్లు ఏర్పాటు చేయాలి..



మండలంలోని వారసంతలో వర్షం కురిస్తే తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. వర్షం వలన క్రయ విక్రయాలకు నిలిచిపోతున్నాయి. వారసంతలో షెడ్లు, గోడలు, తాగునీరు ఏర్పాటు చేయాలి. ఏళ్లు గడుస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

-అంజనేయులు, మానవపాడు

బలిదానానికి గుర్తుగా 'వీర్ బల్ దివాస్'



విద్యార్థులకు ప్యాడ్‌లు అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

అయిజ: మండల పరిధిలోని మేడికొండ ప్రతిభ పాఠశాలలో గురువారం బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భీమసేనరావ్ ఆధ్వర్యంలో 'వీర్ బల్ దివాస్' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. సాహిబ్జాదాస్, జోరావర్ సింగ్ ఫతే సింగ్‌ల బలిదానం చేసిన సందర్భంగా డిసెంబర్ 26ను పాటించాలని ఇటీవల ప్రధాని మోదీ ప్రకటించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోపాల కృష్ణ, పట్టణ ప్రధాన కార్యదర్శి భగత్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు బజారి, ఉపాధ్యాయులు సోమశేఖర్, వీరేష్, శ్రీరాములు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ జాగృతి సేన క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

గద్వాలటౌన్ : బీసీ జాగృతి సేన రూపొందించిన 2025 క్యాలెండర్‌ను బీసీ సంఘాల నాయకులు ఆవిష్కరించారు. గురువారం స్థానిక బీసీ ఉపాధ్యాయ సంఘం కార్యాలయంలో గురువారం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. బీసీల రాజ్యాధికారం కోసం ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్, కార్యదర్శి మధుసూదన్‌బాబు, బీఆర్ఎస్ నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, గంజిపేట రాజు,సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, బీసీటీఏ జిల్లా అధ్యక్షుడు బీకే వెంకటేష్, బీసీ సంఘాల నాయకులు నర్సింహులు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కర్రెమ్మ విగ్రహ ప్రతిష్ఠ



ఊరేగింపుగా ఒడి బియ్యాన్ని తీసుకెళ్తున్న రైతు సంఘం సభ్యులు



ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని కర్రెమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గురువారం అమ్మవారి విగ్రహం, యంత్ర ప్రతిష్ఠ ఏర్పాటు చేశారు. ఊరవాకిలి నుంచి అమ్మవారికి రైతు సంఘం ఆధ్వర్యంలో ఒడి బియ్యాన్ని సమర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో అర్చకులు రామకృష్ణ శర్మ, ఆలయ ధర్మకర్తలు జానకి రాములు, రఘు రాములు, రమేష్, రైతు సంఘం సభ్యులు గోద జయ్యన్న, గోవిందు, చిన్న నాగేంద్రం, శివారెడ్డి, ముత్యాల్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, రగ్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ



భూమి పూజలో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాలటౌన్ : పట్టణంలోని 24వ వార్డు శ్రీ ఆంజనేయస్వామి ఆలయ ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి గురువారం స్థానిక నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. రూ.5 లక్షల వ్యయంతో ప్రహరీ నిర్మాణం చేపట్టారు. నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ శ్రీనివాసులు, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

విద్య, వైజ్ఞానిక రాష్ట్ర మహాసభలు



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

వనపర్తి విద్యా విభాగం: నల్గొండ పట్టణంలో ఈనెల 28 నుంచి 30 వరకు జరిగే టీఎస్ యూటీఎఫ్ 6వ విద్య, వైజ్ఞానిక రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణంలో జిల్లా నాయకులు వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.రవిప్రసాద్‌గౌడ్, డి. కృష్ణయ్య మాట్లాడుతూ అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగనున్న ఈ మహాసభల్లో విద్యారంగం ప్రతిష్టం, ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కోసం చర్చిస్తామన్నారు. మహాసభలకు హాజరై ఉపాధ్యాయులకు మూడు రోజుల పాటు ఓడీ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బి.వెంకటేష్, హమీద్, శ్రీనివాస్‌గౌడ్, తిమ్మప్ప, లక్ష్మణ్ నాయక్, బక్కన్న, సూరయ్య, అయోధ్య రాములు, అర్జున్, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు

ఉండవెల్లి: మండలంలోని తక్కశీల గ్రామంలో క్రిస్మస్ పండుగ సందర్భంగా గురువారం కబడ్డీ పోటీలు నిర్వహించారు. పోటీలను ట్రైనింగ్ ఎస్‌ఐ సతీష్ రెడ్డి, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు దాతల ఆధ్వర్యంలో ప్రారంభించారు. కార్యక్రమంలో తక్కశీల యూత్ పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ

ఉండవెల్లి: మండలంలోని జోగుళాంబ రైల్వే హాల్ట్ సమీపంలోని ప్రయాగ్ స్కూల్ ఎదురుగా రహదారిపై రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. గురువారం రాత్రి అలంపూర్ చౌరస్తా నుంచి క్యాతూర్‌కు చెందిన సాల్మన్ బైక్‌పై వస్తుండగా బైరాపురానికి చెందిన ఖాజమైనుద్దీన్ ఎదురుగా బైక్‌పై వస్తుండగా రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో సాల్మన్ గాయపడగా 108లో కర్నూల్ జనరల్ ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

డీసీఎం ఢీ.. వ్యక్తికి గాయాలు

ఉండవెల్లి: తిరుపతికి పాదయాత్రగా మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్‌కు చెందిన 12 మంది వ్యక్తులు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం పుల్లూరు టోల్ ప్లాజా వద్ద పాదయాత్ర చేస్తున్న శ్రీనివాసును వెనుక నుంచి డీసీఎం ఢీ కొట్టింది. ప్రమాదంలో శ్రీనివాసుకు స్వల్ప గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. ఎస్‌ఐ సతీష్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని విచారించారు. డీసీఎం డ్రైవర్ మంజునాథ్ మద్యం తాగి వాహనం నడిపినట్లు స్థానికులు ఎస్‌ఐకు తెలిపారు.

టిబెట్ దేశస్తుల బైక్ ర్యాలీ



ఉండవెల్లి: టిబెట్‌లో చైనీయుల సృష్టిస్తున్న మారణహోమాన్ని అరికట్టేందుకు అంతర్జాతీయంగా బైక్ ర్యాలీ ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు టిబెటన్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గొంపో దుందుప్ అనే టిబెటియన్ తెలిపారు. గురువారం టిబెట్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు పర్యటనలో భాగంగా పుల్లూరు టోల్ ప్లాజా వద్ద మీడియాతో పేర్కొన్నారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రటరి త్సెరింగ్ చోంఫేల్, మీడియా అధికారి లోబ్సాంగ్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయం జరిగే వరకు పోరాటం



అలంపూర్‌లో సీపీఐ శతాబ్దిక ఉత్సవాల్లో నాయకులు

అలంపూర్ : దేశంలోని ప్రతి పేదవాడికి న్యాయం జరిగే వరకు ఎర్రజెండా పోరాటం చేస్తోందని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పెద్దబాబు అన్నారు. పట్టణంలోని సీపీఐ శతాబ్దిక ఉత్సవాలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ చౌక్‌లో సీపీఐ జెండా ఆవిష్కరించారు. అనంతరం పెద్దబాబు మాట్లాడుతూ.. పేద ప్రజల గొంతుకగా ఎర్రజెండా ప్రభుత్వాలను ప్రశ్నిస్తుందన్నారు. కానీ ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్‌షాలు ఎర్రజెండా లేకుండా చేస్తామని చెబుతున్నట్లు పేర్కొన్నారు. దేశంలో ఎక్కడ ఏ సమస్య లేకుండా చేస్తే వారి కల నెరవేరుతుందన్నారు. బీజేపీ ప్రజలకు సరైన పాలన అందించాలన్నారు. మతాలను అడ్డుపెట్టుకొని ఓట్ల కోసం ప్రజలను రెచ్చగొట్టడం మానుకోవాలన్నారు. ఎర్ర జెండాను దేశంలో ఎవరు ఏమి చేయలేరన్నారు. కార్యక్రమంలో నాయకులు రంజిత్, మద్దిలేటి, నిఖర్, ఖదీర్, నాగన్న, జీవన్, కమల్, శేఖర్, అబ్రహం, గోపాల్, రవి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ చోరీ.. కేసు నమోదు



చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఎర్రవల్లి: ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన సీఎంఆర్ చోరీకి గురైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఇటిక్యాల ఎస్సై వెంకటేష్ వివరాలు.. మండల పరిధిలోని తిమ్మాపురం, కొండేరు, జింకలపల్లి, తదితర గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు చేసి బీచుపల్లి సమీపంలోని సాయి గోపాల ఇండోటెక్ మిల్లుకు కేటాయించింది. ప్రభుత్వం నుంచి వచ్చిన ధాన్యాన్ని మిల్లు యజమానులు సమీపంలోని విజయ ఆయిల్ మిల్లులో నిల్వ చేశారు. ఈ క్రమంలో గుర్తు తెలియని దుండగులు బుధవారం అర్ధరాత్రి ఆయిల్ మిల్లులోకి చొరబడి షెట్టర్ పగులగొట్టి 300 బ్యాగులు (40కేజీ) వడ్ల బస్తాలను దొంగలించారు. గమనించిన ఆయిల్ మిల్లు గుమస్తా తిరుపతయ్య తెల్లవారుజామున మిల్లు ప్రొపరేటర్ హరినాథ్‌కు సమాచారం ఇచ్చాడు. హరినాథ్ ఇటిక్యాల పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న అలంపూర్ సీఐ రవిబాబు సంఘటనా స్థలానికి చేరుకొని చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. మిల్లు సిబ్బందిని విచారించి వివరాలు సేకరించారు.

ఏబీవీపీ రాష్ట్ర కో కన్వీనర్‌గా వెంకటేష్



అయిజ : మండల పరిధిలోని వెంకటాపురం గ్రామానికి చెందిన వెంకటేష్ ఏబీవీపీ రాష్ట్ర కోకన్వీనర్‌గా ఎన్నికయ్యారు. ఏబీవీపీ తెలంగాణ 43వ రాష్ట్ర మహా సభలు సిద్దిపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీలో భాగంగా వెంకటాపురానికి చెందిన డిగ్రీ విద్యార్థి వెంకటేష్‌ను ఏబీవీపీ తెలంగాణ స్టేట్ ఎస్ఎఫ్‌డీ కోకన్వీనర్‌గా ఎన్నుకున్నారు. ఈ విషయమై వెంకటేష్ మాట్లాడుతు.. ఏబీవీపీ రాష్ట్ర, జిల్లా శాఖల వారికి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో రాష్ట్ర స్థాయి పదవి ఇచ్చి తన బాధ్యతను మరింత పెంచారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఏబీవీపీ కోసం అహర్నిషలు కృషి చేస్తానని పేర్కొన్నారు.

తల్లిదండ్రులే తొలి ఆరాధ్యులు



అభిషేక మహోత్సవ హారతిని అందుకుంటున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తిటౌన్: అయ్యప్ప దీక్షాపరులకు మాత్రమే కాకుండా ప్రతి ఒక్కరికీ తల్లిదండ్రులు, గురువులే ప్రథమ ప్రత్యక్ష ఆరాధ్యులు కావాలని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. ప్రతి ఏడాది శబరిమలలో జరిగే మండల పూజ మహోత్సవానికి ప్రతీకగా గురువారం అయ్యప్ప సేవా సమతి ఆధ్వర్యంలో స్థానిక అయ్యప్ప ఆలయంలో ఆలయ కమిటీ పర్యవేక్షణలో అన్నమయ్యప్ప ఆరాధనోత్సవం అఖండ శరణుఘోష మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి మొదలైన పూజ కార్యక్రమాలు భక్తుల భజనలతో రాత్రి 11: 30 నిమిషాల వరకు మిన్నంటాయి. ఈ సందర్భంగా మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ అమ్మను మించిన దైవం లేదని పరమాత్ముడు సైతం తల్లిదండ్రులకు, గురువులకు దాసోం అవుతాడనేందుకు ఎన్నో సందర్భాల్లో రుజువైందన్నారు. అయ్యప్ప పూజలో తల్లిదండ్రులు, గురువులకు పెద్దపీట వేశారని, వారి ఆశీస్సులుంటే అయ్యప్ప అనుగ్రహం తప్పక లభిస్తోందని తెలిపారు. అయ్యప్ప దీక్షతో బుద్ధి వికాస పరిణతి పెంపొందుతుందన్నారు. సాయంత్రం 7 గంటలకు గురుస్వాముల చేతుల మీదుగా అయ్యప్ప ఆలయం ఎదుట గల ఏకాశిల పదునెట్టంబడి పడి పూజను ఘనంగా జరిపించారు. ప్రత్యేకంగా పూజను నిర్వహించి ఆయా దేవతమూర్తి విగ్రహాన్ని ఆవానచేశారు. ఈ పడిపూజ రాత్రి 11:30 నిమిషాల వరకు సాగింది

అన్నమయ్యప్ప ఆరాధాన

గురుస్వాములు అన్నంతో అన్నమయ్యప్పను తయారు చేసి హరిహరసుతుడిని ఆవాహనం గావించి భాజాభజంత్రీలతో అన్నమయ్యప్పను శణుఘోషల మధ్య మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి ఆలయంలోకి తీసుకొచ్చారు. అన్నమయ్యప్పను దర్శించుకున్న వారికి ఏడాది పాటు అన్నానికి లోటుండదని గురుస్వాములు భక్తులకు వివరించారు. అన్నమయ్య ఆరాధాన తర్వాత అయ్యప్ప స్వామి శబరిమలలో దర్శనమిచ్చే రీతిలో వనపర్తిలో ఆభరాణాలతో భక్తులకు దర్శనమిచ్చారు. అయ్యప్ప స్వామికి అభిషేకాలు, చక్రస్నానం తదితర పూజాధికాలు నిర్వహించారు. అలాగే స్వాములకు, భక్తులకు అన్నదాన కార్యక్రమం, రాత్రికి అల్పాహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు రమేష్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు, రాజకీయ నాయకులు, గురుస్వాములు తదితరులు పాల్గొన్నారు.



అయ్యప్పస్వామి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు

ప్రమాదమని తెలిసినా పట్టదా..?



ప్రమాదభరితంగా ఉన్న కల్వర్టుపై వెళ్తున్న ట్రాక్టర్



శిథిలావస్థలో ఉన్న కల్వర్టు

శాంతినగర్ : కల్వర్టుల వద్ద ప్రమాదమని తెలిసినా ఆర్డీఎస్ అధికారులకు పట్టడం లేదని రైతులు, ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వడ్డేపల్లి మండల పరిధిలో ప్రవహించే ఆర్డీఎస్ కెనాల్ వెంట ఉన్న వాగులు, వంకలపై దశాబ్దాల క్రితం చిన్నపాటి కల్వర్టులు నిర్మించారు. కల్వర్టుల వద్ద రక్షణ కోసం ఏర్పాటు చేసిన దిమ్మలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆయా డిస్ట్రిబ్యూటరీల కింద పంటలు సాగు చేస్తున్న రైతులు, ప్రయాణికులు భయాందోళన ప్రయాణాలు చేస్తున్నారు. ఓ వైపు ఆర్డీఎస్ కెనాల్ నిండుగా ప్రవహిస్తుండటం, మరో వైపు లోతైన వాగులు ఉండటంతో వాహనాలు, ఎడ్ల బండ్లు, అదుపు తప్పినా ప్రాణాలు పోతాయంటున్నారు. ఆర్డీఎస్ అధికారులు స్పందించి కల్వర్టుల వద్ద రక్షణ గోడలు నిర్మించి ప్రమాదాలు జరుగకుండా తక్షణమే చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల రైతులు, ప్రయాణికులు కోరుతున్నారు.